
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025



చంద్రన్నకు అన్నదాత దీవెన

- అన్నదాత సుఖీభవ సొమ్ము జమ
- పీఎం కిసాన్ పథకం కూడా అమలు
- ఒకే రోజు ఒక్కో రైతుకు రూ.7 వేలు
- జిల్లాలో 2,75,642 మందికి రూ.192.94 కోట్లు

అనంతపురం అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' తొలివిడత సొమ్ము రైతుల ఖాతాల్లోకి చేరింది. తొలి విడత ఒక్కో రైతుకు రూ.7 వేలు అందింది. జిల్లా వ్యాప్తంగా 2,75,642 మంది రైతులకు రూ.192.94 కోట్లు విడుదలైంది. దేశ వ్యాప్త రైతులకు వారాణసిలో ప్రధాని మోదీ, రాష్ట్ర రైతులకు ప్రకాశం జిల్లా వీరాయపాలెంలో సీఎం చంద్రబాబు సొమ్మును విడుదల చేశారు. జిల్లాలో రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.55.12 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అవుతోంది. సొమ్ము జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రాగానే రైతుల కళ్లలో ఆనందం కనిపించింది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు తమకు అండగా నిలిచాడని అన్నారు. ఆయన చల్లగా ఉండాలని దీవించారు.



గుంతకల్లులో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చిత్రాలకు ధాన్యాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

చల్లగా ఉండు బాబూ..!



కూడేరులో మెగా చెక్కు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

పండుగ వాతావరణం

ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మెగా చెక్కుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ హాజరై, రైతులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. డి.హిరేహాళ్ మండలం గొడిసెలపల్లిలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మెగా చెక్కును రైతులకు అందించారు. కనగానపల్లిలో శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే పరిటాల సునీత, గుంతకల్లు మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ మెగా చెక్కులను అందించారు.

తాడిపత్రి ఏడీఏ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, కళ్యాణదుర్గం కళావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, శింగనమలలో ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మెగా చెక్కును అందించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఎ.నారాయణపురం, నాగిరెడ్డిపల్లెలో టీడీపీ రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, భూసార పరీక్షా కేంద్రం ఏడీ రోజా పుష్పలత పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి

అన్నదాత సుఖీభవ పథకం అర్హులైన రైతులందరికీ వర్తిస్తుంది. అర్హత ఉండి సొమ్ము అందకపోతే రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలి. సమస్య ఏమిటో గుర్తించి పరిష్కరిస్తాం. ఒక్కో రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ప్రతి సంవత్సరం ఇస్తున్నాయి. మొత్తం రూ.20 వేలు మూడు విడతల్లో రైతుల ఖాతాలకు జమ అవుతుంది. గత ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.13,500 ఇచ్చింది. ఈ ప్రభుత్వంలో రూ.20 వేలు ఇస్తోంది. - శివనారాయణ శర్మ, ఇన్‌చార్జి కలెక్టర్





డి.హిరేహాళ్ మండలం గొడిసెలపల్లిలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

12, 13 తేదీల్లో సీపీఐ జిల్లా మహా సభలు



జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాఫర్, ఇతర నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను ఈనెల 12,13 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐని స్థాపించినట్లు తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జిల్లా సభలలో గ్రామ స్థాయి నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివర్గాలను ఆదుకోవడంలో విఫలమయ్యాయని మండిపడ్డారు. ఈప్రభుత్వాల నియంత పోకడలపై రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, లింగమయ్య, నారాయణస్వామి, రాజేష్, సంతోష్‌కుమార్, పద్మావతి, కుళ్లాయిస్వామి, ఇన్సాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు పూర్తి చేయండి

- పీఆర్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) గడువులోపు పెండింగ్ బిల్లుల పనులు పూర్తి అయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. 2014-15 ఏడాదిలో చేపట్టిన పనులకు సంబంధించి 21 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో 1800 పనులకు సంబంధించి రూ.9 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో కొన్ని పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయగా కొందరికి బిల్లులు మంజూరయ్యాయి. దీంతో రెండో విడతలో అన్నీ పూర్తి చేయాలని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. అందులోభాగంగా ఎస్ఈలతో సీఈ శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిపై ఆరా తీశారు. దీంతో ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి ఈఈ కార్యాలయంలోని సిబ్బందితో సమీక్షించారు. బిల్లుల అప్‌లోడ్‌కు సంబంధించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అయితే పదేళ్ల కిందటి పనులు కావడంతో ఎమ్‌బుక్కు దొరక్క కొందరు ఇబ్బంది పడ్డారు. అయితే ఎమ్‌బుక్కులు ప్రణాళిక ప్రకారం పెట్టుకున్నవారు మాత్రం అధికారుల వెంటపడి బిల్లుల మంజూరుకు తగిన చర్యలు చేపట్టారు. శనివారం దాదాపు రూ.3 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది.



చరిత్రలో తొలిసారి

హంద్రీనీవాకు పది పంపుల ద్వారా కృష్ణా జలాల ఎత్తిపోత



పది పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్న దృశ్యం

వజ్రకరూరు(ఉరవకొండ),ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువలో కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారి 10 పంపుల ద్వారా జీడిపల్లి జలాశయానికి వెళ్లే కాలువకు నీటిని ఎత్తిపోస్తున్నారు. మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి 10పంపుల ద్వారా జీడిపల్లి జలాశయం కాలువకు 3,150క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. వారం రోజుల కిందట 8 పంపులతో నీటిని ఎత్తిపోయగా, శనివారం ఉదయం 10 పంపులను ఆన్‌చేసి, కాలువకు నీటిని వదిలారు. దశల వారిగా 12మోటర్ల ద్వారా నీరు ఎత్తి పోయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

కళామతల్లి ముద్దుబిడ్డ.. బళ్లారి రాఘవ

- ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ.. కళామతల్లి ముద్దుబిడ్డ అని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పర్యటక శాఖ ఆధ్వర్యంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జి కలెక్టర్ పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాటకరంగానికి వన్నె తెచ్చిన మహానటుడు బళ్లారి రాఘవ అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, జిల్లా పర్యటక శాఖాధికారి జయకుమార్, డీపీఆర్వో బాలకొండయ్య, డీఈఓ ప్రసాద్‌బాబు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్ పాల్గొన్నారు.



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

మార్పు కోసం తపించిన
మహనీయుడు బళ్లారి రాఘవ
- కళాకారుల నివాళి
- రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం (6లో...)

రేపు పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈనెల 4వ తేదీన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుకోవచ్చన్నారు.





ఫలించిన నిరీక్షణ

ఛాయాపురం తూముకు నీటి విడుదల

- సాగులోకి 15వేల ఎకరాలు
- ఆనందంలో అన్నదాతలు

ఉరవకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల నిరీక్షణ ఫలించింది. వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం హంద్రీనీవా కాలువ నుంచి తూముకు బుధవారం నీటిని విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ తూముకు నీటిని విడుదల చేయడం వలన నియోజకవర్గంలోని విడపనకల్లు మండలంలోని పొలికి, పెంచలపాడు, గడేకల్లు వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం, చాబాల గ్రామాలలోని 15వేల ఎకరాల భూములు సాగు లోకి రానున్నాయి. తూముకు నీరు వస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో రైతులు ఎస్కేప్ చానల్ ద్వారా ప్రధాన కాలువ నుంచి నీటిని అనధికారికంగా మళ్లించుకుని వాడుకునే వారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో హంద్రీనీవా వెడల్పు పనులు తర్వాత మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో తూమును ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఈ తూము ద్వారా 20క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ తూము వద్ద శాశ్వతంగా కాంక్రీట్ పనులు చేపట్టి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తూము వద్ద ప్రవహిస్తున్న నీరు

మూడెకరాలు సాగులోకి వస్తుంది



తూముకు నీరు వదలడంతో నా మూడెకరాల పొలాన్ని సాగు చేస్తా. గతంలో ఎస్కేప్ చానల్‌కు నీరు లేక ఇబ్బందులు పడ్డాం. అనధికారికంగా నీటి వదులుకునే వాళ్లం. మంత్రి చొరవ తీసుకుని తూమును ఏర్పాటు చేయించారు. పది గ్రామాల వారు పంటలను సాగు చేసుకునే వీలు వచ్చింది. - నెట్టెప్ప, రైతు

మంత్రికి రుణ పడి ఉంటాం



పన్నెండేళ్ల కల నెరవేరింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు రుణ పడి ఉంటాం. రైతులే పైపులు వేసుకుని నీటిని మళ్లించుకున్నాం. 15వేల ఎకరాల భూములకు సాగు నీరు అందుతుంది.

- శ్రీనివాసులు, గడేకల్లు రైతు

అధికారుల బాగోతం
- సొంతకార్లకు అద్దె వసూలు
6

పంటల బీమా గడువు పొడిగింపు
- బ్యాంకులో రుణం తీసుకోని రైతులకు ఈనెల 14 వరకు (7లో)

పూల రైతుకు ధరల కటాక్షం..!

శ్రావణం రాకతో రెట్టింపైన రేట్లు
- అన్నదాతకు లాభాలు
- నిలకడగా కొనసాగుతాయని ఆశాభావం


కదిరి మార్కెట్‌లో పూల విక్రయాలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పూల రైతులకు ఆనందం మోసుకొచ్చింది. నిన్నమొన్నటి వరకు నేలచూపులు చేసిన పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ఈ నెలలో పండుగలు, వరలక్ష్మీ వ్రతాలు, పెళ్లిళ్ల ఇతర శుభ కార్యాలయాలు అధికంగా ఉండడంతో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు రెట్టింపయ్యాయి. కొన్నింటి రేట్లు అంతకుమించి పెరిగాయి. కార్తీక మాసం వరకు నిలకడగా ఉంటాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెట్టింపైన ధరలు

నాలుగు నెలలుగా పూల ధరలు భారీగా తగ్గిపోయాయి. ఎండాకాలం, నీరు సమృద్ధిగా లేక పంట దిగుబడి కూడా అంతంత మాత్రమే వచ్చింది. కొంతమంది రైతులు పూలకు ధరలేక పంటను తొలగించారు కూడా. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పూల ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు రెట్టింపయ్యాయి. పండుగలకుతోడు పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలు ఉండడంతో ధరలు నిలకడగా ఉంటాయని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. కనకాంబరం ధర కిలో ఇటీవలి వరకు రూ.250కి దాటలేదు. శ్రావణ మాసం రాకతో కిలో రూ.600 పలుకుతోంది. ఇటీవలి వరకు రూ.250కిలోపే పలికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.350 నుంచి 400 వరకు పలుకుతున్నాయి. బంతి పూల ధర కూడా దాదాపు రెట్టింపయింది. కిలో బంతిపూల ధర గతంలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. దసరాకు రూ.వందకి చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గులాబీల ధర కూడా రూ.50 వరకు పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కదిరి ప్రాంతంలో ముఖ్యంగా తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఓబుళదేవరచెరువు, అమడగూరు, తలుపుల, కదిరి రూరల్ ప్రాంతాల్లో పూల సాగు ఎక్కువగా ఉంటుంది. నీటి వసతిని బట్టి 25 సెంట్ల నుంచి ఎకరాల విస్తీర్ణంలో పంట పెడతారు. కనకాంబరం వివిధ మండలాల్లో ఎకరా నుంచి రెండు ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఈ మూడేళ్ల వరకు ఉంటుంది. నిన్నమొన్నటి వరకు ధరలు లేకపోవడంతో గిట్టుబాటు కాదని కొందరు రైతులు పంటను తొలగించుకున్నారు. పంటను అలాగే ఉంచున్న రైతులు ప్రస్తుతం సంబరపడుతున్నారు. ధరలు పెరగడంతో వారికి లాభాల పంట పండుతోంది.

రైతుల్లో ఆనందం

నష్టపోయింది లేదు..



పదేళ్లుగా కనకాంబరం సాగుచేస్తున్నా. అరెకరాలో నాలుగు విడతలుగా పంట పెడతా. రోజూ పూలను కదిరి మార్కెట్‌కు తరలిస్తున్నా. తద్వారా వచ్చే డబ్బుతో ఇంటి అవసరాలు తీరిపోతాయి. పూలతోటలసాగులో నష్టపోయింది లేదు. ప్రస్తుతం కనకాంబరం కిలో రూ.600 పలుకుతోంది. తద్వారా లాభాలు వస్తున్నాయి.

- సుధాకర్, రైతు, చిన్నరామన్నగారిపల్లి

లాభాలు వస్తున్నాయి



ఎకరాలో బంతి పూలు సాగు చేశా. శ్రావణ మాసం రాకతో ధరలు బాగున్నాయి. గతంలో కిలో రూ.30 పలికేవి. ప్రస్తుతం పూల నాణ్యతను బట్టి రూ.70నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. ఎకరాలో పంట సాగుకు రూ.50వేలకుపైగా ఖర్చు చేశాం. మూడురోజులకోసారి 250 కేజీల దిగుబడి వస్తోంది. ధరలు బాగుండడంతో లాభాలు వస్తున్నాయి.

- రాఘవరెడ్డి, రైతు, కటారుపల్లి క్రాస్

నిరసిద్దాం రండి: వామపక్షాలు

- విద్యుత్ చార్జీలపై పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు
- 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజాసంఘాల నిరసన


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల దోపిడీని ఆపాలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న చేపట్టనున్న నిరసనకు మద్దతిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు, ఎస్‌యూసీఐసి రాఘవేంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చెప్పిన ప్రస్తుత పాలకులు కూడా అదనపు చార్జీలు కొనసాగించడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఖర్చులు పెంచి ప్రజల నుంచి విద్యుత్ సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ అదనంగా రూ.15,485కోట్లు సర్దుబాటు చార్జీలను ప్రజలపై మోపారన్నారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండుకోట్ల మంది వినియోగదారుల పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తోందన్నారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో భాగమే ఇది అని పేర్కొన్నారు. ఎస్‌యూసీఐసీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు(ఎఫ్‌పీపీసీసీ) చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఐదో తేదీన విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసనలకు పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామాంజనేయులు, నాగమణి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వీరనారప్ప, సీపీఐఎంఎం, ఎస్‌యూసీఐసీ కమిటీల నాయకులు పాల్గొన్నారు.


కలెక్టరేట్



అధికారుల బాగోతం

- ప్రతి నెలా రూ.35 వేలు డ్రా
- రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల దర్జా

సొంతకార్లకు అద్దె వసూలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొందరు తహసీల్దార్ల కక్కుర్తితో రెవెన్యూశాఖ పరువు పోతోంది. ప్రతి నెలా అద్దె కారు కోసం ప్రభుత్వం చెల్లించే డబ్బు కోసం కొందరు తహసీల్దార్లు నిబంధనలకు నీళ్లొదిలి వ్యవహరిస్తున్నారు. అద్దె కార్లు కాకుండా సొంతకార్లే వాడుతూ బిల్లులు చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, బినామీల పేర్లతో కార్లు తీసుకుని వాడుకుంటున్నారు. ఎల్లో బోర్డున్న ఇతర కార్ల నంబర్లు పెట్టి ప్రతి నెలా రూ.35వేల బిల్లు డ్రా చేసుకుంటున్నట్లు సమాచారం. వీరిలో చాలామంది సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటున్నా రు. మరికొందరు డ్రైవర్లపై ఆధారపడుతున్నారు. అంటే డ్రైవర్లున్నవారికి రూ.15వేల వరకు ఖర్చు వస్తుంది, లేని వారికి అది కూడా మిగిలిపోతుంది. మరి కొందరు ఘనులు నౌకర్లనే కారు డ్రైవర్లుగా వాడేస్తున్నారట. దీంతో ప్రభుత్వం అందజేసే మొత్తం రూ.35వేలు నేరుగా ఖాతాలో పడిపోతుంది. ఈ కార్ల బాగోతం శాఖలోని కొందరు ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రెవెన్యూ అధికారులు సొంత కార్లు ఉపయోగించడం వల్ల రెండు నష్టాలున్నాయి. అధికారులకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ.35వేలు కారు సౌకర్యం కోసం ప్రభుత్వం నిధులు ఇస్తోంది. కానీ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. ఏదైనా అద్దె కారు తీసుకుంటే సంబంధిత వాహన డ్రైవర్‌కు ఉపాధి కల్పించినవారవుతారు. దీంతో కొంతవరకు నిరుద్యోగ సమస్య తీరే పరిస్థితి ఉంది. ఎల్లోబోర్డు వాహనం ఉన్నవారు లైఫ్ ట్యాక్స్ కింద ప్రభుత్వానికి రూ.80వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. అయితే అధికారులు వైట్ బోర్డున్న సొంత వాహనాలు వాడుతుండటం వల్ల ప్రజలు, ప్రభుత్వానికి నష్టం కలుగుతోంది.

వీఆర్‌ఓలు, ఆర్‌ఐలదే పెట్రోల్, డీజిల్ బాధ్యత



రెవెన్యూ అధికారులు దర్జాగా ప్రతి నెలా డబ్బు గడించడమే కాకుండా కారుకు డీజిల్, పెట్రోల్ కూడా ఉచితంగానే పొందుతున్నట్లు తెలిసింది. ఏదైనా భూమి విషయంలో పని చేసి పెట్టినందుకు కొందరు పెట్రోల్, డీజిల్ పట్టిస్తుంటారని సమాచారం. ఎక్కువ మండలాల్లో వీఆర్‌ఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్‌ఐ)ల సహకారంతో పెట్రోల్, డిజిల్ పట్టిస్తున్న ట్లు తెలిసింది. పక్కన ఆదాయం పొందడంలో బిజీగా ఉండే వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు తుది సంతకాల కోసం తహసీల్దార్లతోనే పని ఎక్కువగా ఉంటుంది. దీంతో తమ అధికారికి ఇలా డీజిల్, పెట్రోల్ పోయించడంతో పాటు కొన్ని ప్రొటోకాల్ వ్యవహారాల్లో అక్రమంగా సంపాదించిన సొమ్ములో కొంత ఖర్చు పెడుతుంటారని తెలిసింది.

విచారించి.. చర్యలు తీసుకుంటాం



జిల్లాలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు వైట్ బోర్డులున్న వాహనాలే వాడుతున్నట్లు నా దృష్టికి రాలేదు. వైట్ బోర్డులు ఉపయోగించి ఎల్లో బోర్డున్న వాహనాల నంబర్లతో బిల్లు పెట్టుకోవడం సరైంది కాదు. జిల్లాలో అందరూ చేస్తున్నారా, లేక కొందరేనా అనేది విచారించి చర్యలు తీసుకుంటాం.

- మలోల, డీఆర్‌ఓ

మార్పు కోసం తపించిన మహనీయుడు బళ్లారి రాఘవ

- కళాకారుల నివాళి
- రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం


రాష్ట్ర, జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులు అందుకున్న కళాకారులు



అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ పరితపించారని వక్తలు కొనియాడారు. దీని కోసం ఆయన రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారని అన్నారు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో ఆయన జీవించారని అన్నారు. బళ్ళారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 'బళ్లారి రాఘవ' అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఆర్వో మలోల, టౌన్ ప్లానింగ్ ఏడీ సువర్ణ తదితరులు హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025 సంవత్సరానికి మేరిగె రామలింగేశ్వరరావు(తెనాలి), భూపతి ధర్మారావు(రేపల్లె, గుంటూరు జిల్లా)కు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డును అందజేసి సత్కరించారు. పౌరాణిక నాటక కళాకారులు వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరామ్‌కు జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు వెంకటరామిరెడ్డి, అరుణ్‌బాబు, ఎస్‌యం బాషా, జ్యోతిరాణి తమదైన శైలిలో నటించి మెప్పించారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్ సాగర్, వడ్డెర సంఘం నాయకుడు రాజేష్, నారాయణస్వామి, వెంకట సుబ్బయ్య, భగవాన్, రంగప్ప, రఘు, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థ మెరుగుకు కేంద్రం చర్యలు

పుట్టపర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ఈక్రమంలోనే రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ శనివారం పాల్గొన్నారు. మంగళగిరి నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ముదిగుబ్బలోని ఎన్‌హెచ్-42 రోడ్డు 8 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. కదిరి రైల్వే క్రాసింగ్ ఆర్‌ఓబీ నిర్మాణం రెండు కిలోమీటర్లకు రూ.65 కోట్లు ఖర్చు చేసి, ఆధునికీకరించి జాతికి అంకితమివ్వనున్నట్లు వారు ప్రకటించారు. వీటి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గి, రోడ్డుప్రమాదాల నియంత్రణ జరుగుతుంది. అలాగే పర్యాటకానికి ప్రోత్సాహం పెరిగి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వేగవంతం అవుతుంది.

కానిస్టేబుళ్లుగా 'వదాన్య' విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఫలితాల్లో వదాన్య జనా సొసైటీ సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపియ్యారు. ఈ సందర్భంగా వదాన్య సంస్థ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి విద్యార్థులను శనివారం అభినందించి మాట్లాడారు. తమ సంస్థ తరఫున ప్రతిభావంతులైన నిరుపేద, నిరాశ్రయ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హాస్టల్ ఫీజులు, స్టైఫండ్, ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్నామని తెలిపారు. పోటీపరీక్షల నోటిఫికేషన్‌లకు అనుగుణంగా ప్రతిభాపరీక్షలు నిర్వహించి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.


కానిస్టేబుళ్లుగా ఎంపికైన వదాన్య విద్యార్థులు

రైతుల సేవకే ప్రాధాన్యం

- రూ.30 కోట్ల టర్నోవర్ సాధిస్తాం
- డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్


నెట్టెం వెంకటేష్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రైతుల సేవకే అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ నెట్టెం వెంకటేష్ తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెట్టెం వెంకటేష్ 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు వెల్లడించారు.

ప్రశ్న: ఉమ్మడి అనంత జిల్లాలో డీసీఎంఎస్ బ్రాంచ్‌లు ఎన్ని ఉన్నాయి...?

జవాబు : అనంతపురం ప్రధాన కార్యాలయంతో పాటు ఒక బ్రాంచ్, తాడిపత్రి, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కళ్యాణదుర్గంలో ఉన్నాయి.

ప్రశ్న: కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించే అవకాశం ఉందా..?

జవాబు: త్వరలో పుట్లూరు మండలం కడవకల్లులో బ్రాంచ్ ప్రారంభిస్తాం. నియోజకవర్గానికి ఒక బ్రాంచ్ ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నాం.

ప్రశ్న: డీసీఎంఎస్ వార్షిక టర్నోవర్ ఎంత..?

జవాబు: వార్షిక టర్నోవర్ ప్రస్తుతం రూ.24కోట్లుగా ఉంది. దీనిని రూ.30 కోట్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న : డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఏవిధమైన సేవలు అందిస్తున్నారు...?

జవాబు : రైతులకు ఎరువులు, మందులు, నిత్యావసర సరుకులు బహిరంగ మార్కెట్‌కంటే తక్కువకు అందిస్తున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్రాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : కొత్తగా ఏవైనా కార్యక్రమాలు చేపడుతున్నారా..?

జవాబు : డీసీఎంఎస్ ద్వారా సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ కార్యాలయాలకు స్టేషనరీ సరఫరా.. దీపావళికి టపాసుల అమ్మకాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వెంటనే ప్రారంభిస్తాం.

ప్రశ్న: డీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి...?

జవాబు : అనంతపురం ప్రధాన కార్యాలయంలో సుమారు 20వరకు షాపులు, గోడౌన్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఆర్ఎఫ్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. గుత్తి రోడ్డులో మూడు ఎకరాల స్థలంలో షాపులకు అద్దెకిచ్చాం. తాడిపత్రి, కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గంలో షాపులు అద్దెకు ఇచ్చాం. డీసీఎంఎస్‌కు చెందిన ఆస్తులను పరిరక్షిస్తూ, ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న: సొసైటీల ద్వారా ఎలాంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు...?

జవాబు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగమైన డ్రోన్‌లు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

బోధనపై దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు అడుగులు

- పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలు
- 15 రోజులకోసారి రాష్ట్ర కమిటీ సమీక్ష
- జిల్లాలో అమలుకు కుస్తీ

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన వసతులు కల్పిస్తోంది. పలు పథకాలు, సౌకర్యాల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతోంది. అయినా విద్యాప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడట్లేదు. కేంద్రం నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో ఈ విషయం స్పష్టమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లల సామర్థ్యాలు అనుకున్న స్థాయిలో లేవని ఆ సంస్థలు తేల్చాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడంలేదని, ఇంగ్లీష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. పథకాలు అమలు చేస్తున్నా, సౌకర్యాలు కల్పిస్తున్నా.. విద్యాప్రమాణాలు ఎందుకు మెరుగు పడట్లేదన్న దానిపై మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖల అధికారులు దృష్టి పెట్టారు. మెరుగు పరిచే దిశగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ ఫోరం కమిటీలను నియమించి, పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమించారు. కమిటీల పనితీరు, విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై 15 రోజులకోసారి రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

అకడమిక్ ఫోరం కమిటీలు

విద్యాప్రమాణాల పెంపు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ ఫోరం కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో డీఈఓ చైర్మన్‌గా సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈఓలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్లు చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండలస్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈఓ-1, ఎంఈఓ-2, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీ టీచర్లకు కమిటీలో అవకాశం కల్పించారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు, ఎన్‌రోల్‌మెంట్, పిల్లలు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు, వాటితో ఎలాంటి వసతులు కల్పించారు, డబ్బు ఎలా ఖర్చుపెట్టారు తదితరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి అకడమిక్ ఫోరం కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.


ఎఫ్ఎల్ఎన్ ప్యానల్‌తో పాఠం చెబుతున్న టీచర్

కమిటీలతో నిత్యం పర్యవేక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిల్లో అకడమిక్ ఫోరంకమిటీలు ఏర్పాటు చేశాం. జిల్లా కమిటీని సైతం నియమించాం. విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ కార్యాలయంలో శనివారం ఆయన సబ్సిడీ లకు సంబంధించి పలు వివరాలను వెల్లడించారు. పెట్టుబడి సబ్సిడీ కింద ఓసీ జనరల్‌కు 25 శాతం రాయితీ ఉందన్నారు. విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.1 మంజూరు చేస్తారన్నారు. వంద శాతం సేల్స్ ట్యాక్స్ రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి కింద ఓసీ మహిళతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు పెట్టుబడి రాయితీ 45 శాతం ఇస్తామన్నారు. విద్యుత్‌ను యూనిట్‌కు రూ.1.5 ప్రకారం కేటాయిస్తామన్నారు. సేల్స్ ట్యాక్స్ మాత్రం అందరికి ఒకే విధంగా 100 రాయితీ ఇస్తారన్నారు.

క్రైం కార్నర్

219 గంజాయి చాక్లెట్ల పట్టివేత



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 219 గంజాయి చాక్లెట్లను త్రీటౌన్, ఈగల్ సెల్, జీఆర్పీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా అరికట్టడంలో భాగంగా ఉదయం తనిఖీలు నిర్వహించారు. త్రీటౌన్, ఈగల్ సెల్, గవర్నమెంట్ రైల్వే పోలీసుల సంయుక్తంగా తనిఖీలు చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వెళ్లే 18463 నంబర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ఉదయం 6.20 గంటలకే తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఒడిసాకు చెందిన సాల్మాన్ అనే ప్రయాణికుడి వద్ద గంజాయి పదార్థం ఉన్న 219 చాక్లెట్లు గుర్తించి, పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటర్ డిక్కీలోని నగదు చోరీ



నగదు దోచుకెళ్లిన అనుమానితులు

కదిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్కూటర్ డిక్కీలో పెట్టిన రూ.70వేల నగదును దొంగలు అపహరించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుటాగుళ్లకు చెందిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ శనివారం కరూర్ వైశ్యాబ్యాంకు నుంచి రూ.70వేలు నగదు డ్రా చేశారు. డబ్బును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని బైపాస్ రోడ్డులోని మెకానిక్ దుకాణం వదకు చేరుకున్నారు. అక్కడ ఆపి మెకానిక్ వద్దకెళ్లారు. బ్యాంకు వద్ద నుంచి వారిని బైక్‌లో ఫాలో అయిన ఇద్దరు దుండగులు ఇదే అదునుగా భావించి, డిక్కీలోని నగదు అపహరించుకు వెళ్లారు. మెకానిక్ షాపు నుంచి బయటకు వచ్చిన ఇమాంఖాన్, సమీర్‌ఖాన్ డిక్కీలో చూసుకోగా.. నగదు కనిపించలేదు. చోరీ అయినట్లు గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. డబ్బు కొట్టేసిన ఇద్దరికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని విడుదల చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

అమరాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలదపల్లికి చెందిన కెంచమ్మ(59) అప్పుల బాధ భరించలేక శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కెంచమ్మ భర్త గతంలోనే మరణించాడు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.4లక్షలు పైబడి అప్పు చేసింది. వాటిని తీర్చేందుకు కుమారుడు బెంగళూరుకు కూలి పనుల కోసం వెళ్లాడు. దీంతో కెంచమ్మ ఒంటరిగా ఉంటుండేది. ఈ నేపథ్యంలో అప్పుల వారి బాధలు అధికమవడంతో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకుని మరణించింది. అటుగా వెళ్లిన వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని మడకశిరకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

పనిచేసిన పాలకేంద్రాన్నే కొల్లగొట్టారు

- జనరేటర్, క్యాన్లు చోరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్, చిత్రంలో ఎస్ఐ రాంబాబు

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాము పనిచేసిన పాల కేంద్రం మూతపడడంతో రోడ్డునపడిన వారు అందులోని సామగ్రిపై కన్నేసి, కొల్లగొట్టారు. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యారు. మూతపడిన పాలకేంద్రంలో చోరీ కేసులో ముగ్గురు నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన జనరేటర్, 70 అల్యూమినియం పాల క్యాన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుల అరెస్టు వివరాలను అనంతపురం రూరల్ సీఐ శేఖర్.. ఎస్ఐ రాంబాబుతో కలిసి శనివారం వెల్లడించారు. నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన షేక్షావలి (31) తపోవనంలో డీజే లైటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం పాత మొలకల చెరువుకు చెందిన గోవిందు సింహాద్రి (24), హిందూపురం పట్టణంలోని డీఆర్ కాలనీకి చెందిన మనోహర్ (35) స్నేహితులు. గోవిందు సింహాద్రి, మనోహర్ గతంలో కొర్రపాడు, రాచానపల్లిలోని ప్రభుత్వ పాల కేంద్రాల్లో పనిచేశారు. అవి మూతపడడంతో వీరిరువురు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో షేక్షావలికి తన డీజే షాపులోకి జనరేటర్ అవసరమైంది. ముగ్గురూ కలిసి ప్లాన్ వేశారు. గతనెల 14న రాచానపల్లిలోని పాలకేంద్రంలో ఉన్న 25 కేవీఏ సామర్థ్యంగల జనరేటర్, 70 పాలక్యాన్లను చోరీ చేసి, రెండు వాహనాల్లో తరలించారు. వాటిని విక్రయించేందుకు తరలిస్తుండగా.. పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి, తపోవనం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపాన ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి జనరేటర్, పాల క్యాన్లు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

కదిరిఅర్బన్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. పది ఉత్తీర్ణులైన వారు 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 5వ తేదీన ఉదయం కళాశాలలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బంటు భుజాలపై భగవంతుడు

కసాపురంలో హనుమద్ వాహనంపై ఊరేగిన సీతారాములు



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హనుమద్ వాహనంపై సీతారాములు

గుంతకల్లుటౌన్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పరమ భక్తుడు, బంటు అయిన నెట్టికంటి ఆంజనేయస్వామి భుజాలపై సీతాదేవి సమేతంగా రామచంద్రమూర్తి విహరించారు. శ్రావణ శనివారం సందర్భంగా మండలంలోని కసాపురంలో ఆలయ ప్రాకారోత్సవం కనులపండువగా సాగింది. శ్రీసీతారామచంద్రస్వామి సహిత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించారు. హనుమద్ వాహనంపై కొలువు దీర్చి, ఆలయ ప్రాకారోత్సవాన్ని మేళతాళాల మధ్య గావించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు తులసీ దళాల అలంకరణ



బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామికి లక్ష తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారిని గంగాజలంతో అభిషేకించి, పూజలు చేశారు. పంచామృతాభిషేకం, విష్ణుపారాయణం, అష్టోత్తర నామావళి గావించారు. తులసీ దళాలతో స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి, నైవేద్యం సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు.. స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించారు. నేమకల్లు క్రాస్ నుంచి భక్తుల కోసం బొమ్మనహాళ్‌కు చెందిన వెంకటేశ్వరరావు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

మురడికి పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

డీ.హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి ఆంజనేయ స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రధాన అర్చకులు, సిబ్బంది తెల్లవారుజామునే సుప్రభాత సేవ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పూలు, ఆభరణాలతో ప్ర త్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా722 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.24, సరసరి ధర రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

రిజర్వాయర్‌కు 2,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2170 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇక్కడి నుంచి ఔట్‌ఫ్లో 2130 క్యూసెక్కులు వెళుతున్నాయని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.784 టీఎంసీల నీటి నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన బలపం రాయి వ్యాపారి వెంకటరమణ నాయుడు(43) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అనంతపురం రూరల్ పోలీసులు శనివారం తెలిపిన మేరకు వెంకటరమణ తన వ్యాపారం నిమిత్తం శుక్రవారం అనంతపురం వచ్చాడు. పనికాకపోవడంతో మరో పని మీద రాత్రి 10 గంటలప్పుడు కాటిగానికాల్వకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఒంటిగంట సమీపంలో బీజేపీ కాలనీ ఆర్చ్ సమీపంలో కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగావకాశాలు

కదిరి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ చేసినవారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున శనివారం ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసినవారికి జర్మన్ భాష నేర్పించి, ఆ దేశంలో నర్సులుగా ఉద్యోగావశాకాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9390176421 నంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్ల పనిచేస్తున్న టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందజేస్తోందన్నారు. దరఖాస్తులను ఈనెల 8వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారికి మూడు సెట్లు చొప్పున అందజేయాల్సి ఉంటుందన్నారు.

నిబంధనలు ఇవీ..

- కనీసం 10 సంవత్సరాల బోధనానుభవం కలిగి ఉండాలి
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- రాష్ట్రస్థాయిలో ఇదివరకే అవార్డు తీసుకున్న వారు అనర్హులు.
- దరఖాస్తుదారులపై క్రిమినల్ కేసులు ఉండరాదు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉన్నవారు అనర్హులు.
- జాతీయ అవార్డుకు దరఖాస్తు చేసిన వారు కూడా అనర్హులు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి పోస్టుకు జిల్లాలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న పీఈటీలు, పీడీలు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. 58 సంవత్సరాలలోపు వయసు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో నేటి సాయంత్రంలోపు అందజేయాలన్నారు. వివరాలకు డీఈఓ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

గొల్లపల్లికి వస్తే చాలు..!

- 15 రోజుల్లో మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల
- లైనింగ్ పూర్తయితే 2వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం



మడకశిర బ్రాంచ్ కెనాల్

పెనుకొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు వచ్చిన తక్షణం మడకశిర బ్రాంచ్ కాలువకు విడుదల చేసేందుకు హెచ్ఎన్ఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.92టీఎంసీలుకాగా ప్రస్తుతం 1.2టీఎంసీల నీటి నిల్వ ఉంది. 15రోజుల్లోగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. కాగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను రూ.4కోట్లతో చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో ఈ కెనాల్ ద్వారా హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలోని చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా వెయ్యి నుంచి 1200క్యూసెక్కుల నీరు సరఫరా అయ్యేది. లైనింగ్ పనులు పూర్తయితే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుందని హెచ్ఎన్ఎస్ అధికారులు చెబుతున్నారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువుల చివరి ఆయకట్టు వరకు నీరు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.



కొత్తపల్లి వద్ద కొనసాగుతున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు

అయ్యో.. దేవుడా..!

- మధురైలో రోడ్డు ప్రమాదం
- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- బాధిత కుటుంబాల్లో విషాదం

కుందుర్పి/ముదిగుబ్బ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆ ఇళ్ల ఆశాదీపాలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అంతులేని శోకం మిగిల్చింది. తమిళనాడులోని మధురైలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థులు రోహిత్ (22), కార్తీక్ (22) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కుమారుడు..

కుందుర్పి మండలంలోని మాయదార్లపల్లికి చెందిన వలస మూర్తి, రూప దంపతులకు కుమార్తెలు మేఘన, ఐశ్వర్య, కుమారుడు రోహిత్ ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఒక్కగానొక్క కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలన్న ఉద్దేశంతో మధురై జిల్లాలోని కలసలింగం యూనివర్సిటీలో బీటెక్ చదివిస్తున్నారు. అదే కాలేజీలో ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన శ్రీనివాసులు, లీలావతి దంపతుల కుమారుడు కార్తీక్ చదువుతున్నాడు. ఇద్దరూ బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండేవారు. శుక్రవారం సాయంత్రం కాలేజీ ముగించుకుని, హాస్టల్‌కు ఇద్దరూ బైక్‌పై బయల్దేరారు. ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, ఐడీ కార్డు ఆధారంగా సమీప యూనివర్సిటీకి సమాచారాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే మధురైకి తరలి వెళ్లారు. కార్తీక్‌కు అన్న ఉన్నాడు. సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



కార్తీక్, రోహిత్ (ఫైల్)

పంటల బీమా గడువు పొడిగింపు

- బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులకు ఈనెల 14 వరకు..
- రుణం తీసుకున్న రైతులకు నెలాఖరు దాకా అవకాశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఫసల్ బీమా, వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించారు. బీమా సంకటం శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గడువు పొడిగింపు అంశంపై ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం స్పందించి ప్రధాన పంటలు ఆగస్టు నెలలో సాగయ్యే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫసల్ బీమా, వాతావరణ బీమా కోసం ప్రీమియం చెల్లించే గడువును పొడిగించాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు లేఖ రాశారు. వారు ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లడంతో గడువు పొడిగింపు ఉత్తర్వులు వచ్చాయి. ఫసల్ బీమా యోజన కింద కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలకు జూలై 31, వరి పంటకు ఈనెల 15వతేదీ వరకు ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉండింది. అలాగే వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు ప్రీమియం చెల్లించేందుకు ఇదివరకు జూలై 15వతేదీ వరకే గడువు విధించారు. తాజాగా ఫసల్ బీమా, వాతావరణ బీమా కోసం బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులకు ఈనెల 14దాకా, రుణం తీసుకున్న రైతులకు ఈనెలాఖరు దాకా ప్రీమియం చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేసిన పాలకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేవలం రూ.ఏడు వేల ఆర్థిక సాయాన్ని అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేశాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు వట్టి కరువును ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో 8.58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా, 3.01 లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనం పడిందన్నారు. మిగతా భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకునే పాలకులు రైతులకు రూ. ఏడు వేలు విదిల్చి, వారిని బిచ్చగాళ్లలాగా చూశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవాను వైడెనింగ్ చేయడం అభినందనీయమే కానీ పిల్ల కాలువలను పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. పట్టిసీమ పూర్తయితే రాయలసీమకు నీరు వస్తుందన్నారని, అది సాధ్యపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ ఆ మాటలే చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపి, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

బయటికి వెళ్లాక మార్పురావాలి

- ఖైదీలకు జిల్లా న్యాయాధికారి సూచన



జైలు అధికారితో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భీమరావు

హిందూపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జైలు నుంచి బయటికి వెళ్లాక ఖైదీల ప్రవర్తనలో మార్పురావాలని ఉమ్మడి జిల్లా న్యాయాధికారి భీమరావు సూచించారు. స్థానిక సబ్‌జైలును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న భోజనాలపై ఆరాతీశారు. కొంతమంది ఖైదీలు వారి సాధక బాధకాలను న్యాయాధికారికి వివరించారు. అరెస్ట్ చేసినప్పుడు పోలీసులు వేధిస్తే న్యాయాధికారికి చెప్పాలన్నారు. అనంతరం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు సమీపంలో నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఏడీజే కంపల్లె శైలజ, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఆధార్ శిబిరాలు



విద్యార్థితో ఆధార్ నమోదు చేయిస్తున్న డీడీ శ్రీనివాసరావు, మొబైల్ బృందం

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఆధార్ నమోదు చేసుకోని జిల్లాలోని గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేంగా మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ శాఖ జిల్లా కేంద్రంలో శనివారం ఆధార్ శిబిరాన్ని డీడీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 30 శాతం మంది గిరిజన విద్యార్థులకు ఆధార్ సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఆధార్ నమోదు చేయించి, ప్రభుత్వ పథకాలు అందజేసే దిశగా మొబైల్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం జిల్లాలోని అన్ని మండలాల్లో శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. గిరిజన విద్యార్థులతో ఆధార్ నమోదు చేయించాలని వారి తల్లిదండ్రులకు డీడీ సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆత్మకూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

ఆత్మకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం సీఎం చంద్రబాబు చిత్ర పటానికి టీడీపీ మండలనాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవను అమలు చేసినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాణస్వామి, నాయకులు నాగేంద్ర, తిక్కస్వామి, హోసూరన్న,మల్లన్న,పోతన్న, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని నసనకోట గ్రామంలో రైతులు.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యేపరిటాలసునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఆనందాన్ని పంచుకున్నారు. సీఎం చంద్రబాబు అన్నదాతసుఖీభవ నిధులు విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు లింగాశ్రీధర్‌నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ గంగాధర, లింగన్న, ప్రకాశ్, కాంతస్వామి, షణ్ముఖ ప్రసాద్, ధర్మవరపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరియన్‌చెరువు, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు, అధికారులు మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వారికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అశోక్‌నాయక్, సచివాలయాల సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, హరినాథరెడ్డి, ముత్యాలప్ప, రాజు, నారాయణ, చంద్రాయుడు, పోతలయ్య, చెన్నకేశవులగౌడ్, బెస్తనాగార్జున, శివ, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

●రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఖాతాల్లో డబ్బులు జమచేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాలసునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలకన్వీనర్ కొండప్ప, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ జాఫర్, మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు, వాటర్‌షెడ్‌ఛైర్మన్ మల్లికార్జున, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లిలో టీడీపీ నాయకులు మీసమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నరసింహ చౌదరి, తెలుగుయువత రాష్ట ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు కందుల ఓబులపతి, వెంకటేసులు, నాగేంద్ర, నరసింహులు, రామకృష్ణ పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న ఆలం వెంకటనరసానాయుడు

నార్పల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో శనివారం చెత్త నుంచి సంపద తయారీపై జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు ఒక్కరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు, మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీ సహాయ సహకారాల వల్ల చెత్తతో సంపద తయారీలో తమ పంచాయతీ జిల్లా స్థాయిలో అన్ని గ్రామ పంచాయతీలకు ఆదర్శవంతంగా నిలవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఇంటి నుంచి వెలువడే చెత్తను ఏవిధంగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలి అనే దానిపై శిక్షకుల ద్వారా అధికారులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు, డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి, స్థానిక ఎంపీడీఓ మమతాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ శైలజరాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లను సరిదిద్దాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన సచివాలయ ఉద్యోగుల సీనియారిటీ జాబితాలో అవకతవకలను సరిచేసి అర్హులకు న్యాయం చేయాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం వారు కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, మల్లికార్జున, చంద్ర, శంకరయ్య, రవికుమార్, యాగంటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: వైసీపీ

అనంతపురంరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని వైసీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో గల రాయల్‌నగర్‌లో శనివారం వారు బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ఆర్భాటపు ప్రచారాలు చేసుకుంటోందని తెలిపారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం: సీడీపీఓ

రామగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని, పుట్టిన నాటి నుంచి ఆరునెలల వరకు తల్లిపాలే తాపాలని ఐసీడీఎస్ సీడీపీఓ కవిత సూచించారు. మండలంలోని సుద్దకుంట పల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామమహిళలు, చిన్నారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇందులో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఈ వారోత్సవాలు 7వతేదీ వరకు జరుగుతాయన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కనుక బిడ్డకు తల్లిపాలే తాపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలితా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: స్థానిక సుల్తాన్‌పేట-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ భారతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను తాపించాలన్నారు. ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు నారాయణమ్మ, మంజుల, సిబ్బంది , బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



సుద్దకుంటపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే పరిటాల సునీత

● కలెక్టర్ చేతన్‌తో కలిసి రైతులకు అన్నదాత సుఖీభవ మెగా చెక్కు అందజేత



సీఎం చిత్రపటానికి ధాన్యాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

కనగానపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి అని, రైతు బిడ్డ అయిన ఆయనకే రైతుల కష్టాలు తెలుస్తాయని, అందుకే రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ చేతన్, ధర్మవరం ఆర్డీఓ మహేష్, రైతులు పాల్గొన్నారు. ముందుగా వారందరూ సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని టీవీల ద్వారా వీక్షించారు. అనంతరం అన్నదాత సుఖీభవకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే, కలెక్టర్ రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గానికి చెందిన 52 వేల మంది రైతులకు రూ. 36 కోట్ల మేర అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదలైందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేనప్పటికీ రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సొమ్మును అందిస్తోందన్నారు. దీంతోపాటు కరువు జిల్లాలో హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరందించి సీఎం చంద్రబాబు రైతుల పాలిట దేవుడయ్యారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ మాది రైతుకుటుంబమేనని, అందరికీ అన్నం పెట్టేది రైతన్నేనని అన్నారు. రైతు బాగుంటేనే అందరూ సుఖంగా ఉంటారన్నారు. తర్వాత స్థానిక రైతు రమణ అరటి తోటలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్రపటానికి ఎమ్మెల్యే పరిటాల సునీత వరి ధాన్యంతో అభిషేకం చేశారు. అనంతరం దాదులూరు వద్ద నిరుపయోగంగా ఉన్న గోరు చిక్కుడు కర్మాగారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సుధాకర్ చౌదరి, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ అంకే పరిమళా రామక్రిష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బిల్లే భాస్కర్, నాయకులు బట్టా సురేష్‌చౌదరి, బిల్లేదాము, పతకమూరి అంజి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ మెగాచెక్కు అందజేత





నారాయణ పురం, శింగనమలలో మెగా చెక్కులను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్బన్ నియోజకవర్గ పరిధిలో గల ఏ.నారాయణపురం రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు అన్నదాత సుఖీభవకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ అర్బన్‌నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో 371మంది రైతులకు రూ.25.97లక్షల మేర అన్నదాత సుఖీభవ మంజూరైనట్లు తెలిపారు. ఇందులో పీఎం కిసాన్ కింద రూ.7.42లక్షలు, అన్నదాత సుఖీభవ కింద రూ.18.55లక్షలు విడుదలైందన్నారు. ఏడీఏ ఎస్టీఎల్ ఏఓ శ్రీనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనంతపురం డివిజన్ వ్యవసాధికారి రోజా పుష్పలత, తహసీల్దార్ హరికుమార్, ఏఈఓ మురళీ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌బాబు, వీఆర్వోలు వెంకటరామిరెడ్డి, సాయికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఆదెన్న, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, యువనాయకుడు సుందర్, కార్పొరేషన్ల డైరెక్టర్లు పీఎల్ఎన్‌మూర్తి, పరమేశ్వర్, కొండన్న, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్, బీసీసెల్ నగర అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, నాయకులు భాగ్యరాజ్, ఆదినారాయణ, కేశవరెడ్డి, హరి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

● శింగనమల: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన మెగా చెక్కును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఏడీసీసీబీ చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి రైతులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో రైతులకు రూ.30.04 కోట్ల మేర అన్నదాత సుఖీభవ సొమ్మును జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు,ఏడీ పద్మలత, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఏఓ అన్వేష్‌కుమార్ ,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా నాయకులు డేగలకృష్ణమూర్తి, పర్వతనేని శ్రీధర్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి,గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీ నారాయణ, మారుతీనాయుడు, మాసూల చంద్ర పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రోడ్లెక్కిస్తే.. గుణపాఠం తప్పదు

● ప్రభుత్వానికి ఫ్యాప్టో హెచ్చరిక




ధర్నాలో పాల్గొన్న ఫ్యాప్టో నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను రోడ్లెక్కిస్తే అందుకు తగిన గుణపాఠం చెబుతామని ఫ్యాప్టోనేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యారంగం, టీచర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శనివారం వారు టీచర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీనివాస నాయక్, రమణారెడ్డి, రామాంజనేయులు, పురుషోత్తం, లింగమూర్తి, ఓబిలేసు, లింగమయ్య, నాగేంద్ర, సిరాజుద్దీన్, వెంకటేశులు, వెంకటరత్నం,వెంకటసుబ్బయ్య,అక్కులప్ప తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులను పిల్లలకు పాఠాలు చెప్పించకుండా ఇతర పనులు అప్పగిస్తూ వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, డీఏలు చెల్లించాలని, ఐఆర్,పీఆర్సీకమీషన్ ప్రకటించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బదిలీలు,పదోన్నతులు ఇచ్చి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాయకులు గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, ఎంఈఓ-2 రామచంద్ర,పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్నగౌడ్, పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ, విక్రయాలు జరగరాదు

● డీసీ నాగమద్దయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న నాగమద్దయ్య

బుక్కరాయసముద్రం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటు సారా తయారీ, విక్రయాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ.. ఏగ్రామంలో కూడా నాటు సారా బట్టీలు కనిపించకూడదన్నారు. నిత్యం దాడులు చేస్తుండాలని సూచించారు. వీటితో పాటు మద్యం దుకాణాల నిర్వహణపై దృష్టిసారించాలని, అక్రమ మద్యం రవాణా అరికట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయంను విజయవంతం చేయాలని అన్నారు. అలాగే యువత డ్ర గ్స్ గంజాయికు బానిసలు కాకుండా ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. గంజాయి విక్రయాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. తర్వాత స్టేషన్ పరిధిలో కేసుల సంఖ్య ,వాటి రికార్డులను తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ నాగుసునీతారాణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆర్‌ఎఫ్ రోడ్డు ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహం



ఆలయ ప్రాంగణంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్ ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాల్‌నగర్‌లోని సద్గురు సాయినాథ మందిరం, రామ్‌నగర్ వేంకటేశ్వరుడి ఆలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేద పండితులు ఉదయాన్నే మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. అనంతరం ఆలయాల ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. తర్వాత పండితులు వ్రత విశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించారు.

లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కొండపై వెలసిన మలహోబుల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాస శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించారు. అనంతరం ఆలయ ఆవరణలో దాతలు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి దేవదాసు, పంపనూరు ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

రాప్తాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో చేపడుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు వెంటనే పూర్తిచేసి రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ఏఈ శివప్రసాద్, సర్పంచ్ తిరుపాలు, తెలుగు యువత మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు

శింగనమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంపమల్లయ్య కొండ మీదకు వెళ్లే భక్తుల కోసం తాగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు ఓ రైతు. ప్రస్తుతం శ్రావణ మాసం సందర్భంగా భక్తులు అధికంగా స్వామి దర్శనం కోసం కొండమీదకు వెళుతుంటారు. అక్కడ తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వెస్టునరసాపురానికి చెందిన రైతు వీరనారప్ప కొండ కింద నీటి ట్యాంకర్ ఏర్పాటు చేశారు. కొండ దిగగానే వారికి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు హోటళ్లలో శనివారం ఆహారకల్తీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఏఎఫ్‌సీ) శ్రీనివాస్, ఫుడ్‌సేఫ్టీ అధికారిణి తస్లీం హోటళ్లలోని కిచెన్‌లు, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎఫ్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంస్థ ఆమోదం పొందిన విక్రేతల నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలని హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. కిచెన్‌లను, ఫ్రిజ్‌లను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా పలుహోటళ్లకు నోటీలు జారీ చేసినట్లు చెప్పారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

నార్పల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డేవిడ్ శనివారం ప్రకటనలో తెలిపారు. డీఈఈఈ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, డీఎంఈ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయన్నారు. ఫీజు ఏడాదికి రూ. 5800 ఉంటుందన్నారు. టెన్త్ ఒరిజినల్ టీసీ, స్టడీ, ఎస్ఎస్‌సీ పాస్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 8096907527, 9110525240 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రోన్ ద్వారా ప్రతి ఇల్లు సర్వే

అనంతపురంరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ స్కీమ్ కింద గ్రామాల్లోని ప్రతి ఇంటిని డ్రోన్ ద్వారా సర్వే చేయడం జరుగుతుందని చిన్నంపల్లి గ్రామ సర్పంచు శివశంకర్ తెలిపారు. గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి చరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్కీమ్‌పై గ్రామ ప్రజలకు అవగాహన నిమిత్తం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. స్వమిత్వ స్కీమ్ ద్వారా క్షేత్రస్థాయిలో అధికారులు గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే చేసి ఆస్తి కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ కవిత, వీఆర్వో రాజు, సర్వేయర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచు కొండయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువపై బండల ఏర్పాటు



అంగన్‌వాడీ కేంద్రం ముందు మురుగుకాలువ పై బండలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి స్పందన

రాప్తాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ని బండమీదపల్లిలో శ్మశానవాటిక వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఎదు ట మురుగుకాల్వపై బండ లు ఏర్పాటు చేశారు. ఆ మురుగుకాల్వ ఓపెన్‌గా ఉండడం వల్ల అంగన్‌వాడీ చిన్నారులకు ప్రమాదం పొంచి ఉండడంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథ నం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ విజయలక్ష్మి, పం చాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడు శనివారం మురుగుకాలువపై బండలు ఏర్పాటు చేయించారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రం భవనానికి ప్రహరీ కూడా నిర్మిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

అరుణాచలేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



అరుణాచలంలో ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు

శింగనమల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువన్నామలై(అరుణాచలం)ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. అరుణాచలేశ్వరుడిని ఎమ్మెల్యేతో పాటు తండ్రి రవికుమార్, తమ్ముడు పవన్‌సాయి, అక్క కిన్నెరశ్రీ, బావ సాయితో పాటు మరి కొందరు దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ పూజలు చేయించినట్లు తెలిపారు.

చేనేతలకు ఉచిత విద్యుత్

● రాష్ట్ర ప్రభుత్వానికి నేతన్నల కృతజ్ఞతలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చేనేత రంగంలో కీలక భూమిక పోషించే చేనేత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రకటన చేశారు. దీంతో కూటమి ప్రభుత్వానికి నేతన్నలు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామానంద చేనేత సంఘం అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ కరెంట్ బిల్లుల రూపంలో నేతన్నలు ఆర్థికభారం మోస్తున్నారన్నారు. కొంతమేరకు ఆర్థిక వెసులుబాటు కల్పించేలా గుంత మగ్గాల కార్మిక కుటుంబాలకు 200, మరమగ్గాల కుటుంబాలకు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్‌ను ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. దీంతో ఒక్కో చేనేత కుటుంబానికి నెలకు దాదాపు రూ.1000 మేర కరెంట్‌బిల్లు ఆదా అవుతుందన్నారు. ఉచిత విద్యుత్ ఈనెల నుంచి అమలౌతుందని, వచ్చేనెల నుంచి కరెంట్‌బిల్లు కట్టాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రవీంద్రనాథ్, సభ్యులు భాస్కర్, రామకృష్ణ, ఎర్రిస్వామి, రామానాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం: సీపీఎం

అనంతపురంరూరల్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వలన ప్రజలపై భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య అన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5న సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టనున్నామని, విజయ వంతం చేయాలని కోరారు. ఈ మేరకు మండలంలోని కందుకూరు గ్రామంలో శనివారం కరపత్రాలు, బుక్‌లెట్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన రూ. లక్షకోట్ల మేర ప్రజలపై భారం పడుతోందన్నారు. ఆదాని కంపెనీలకు లాభం చేకూర్చడానికి ఈ విధానం తీసుకురావడం అన్యాయమన్నారు. వీటిని రద్దు చేయడానికి సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాప్తాడు, రూరల్ ప్రాంతీయకార్యదర్శి రామాంజినేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, సుబ్బారావు, మల్లేష్, ప్రకాష్, వంశీ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

అనంతపురం విద్య, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, జాతీయపతాకరూపకర్త పింగళివెంకయ్య జయంతి వేడుకలను జిల్లా గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ కార్యదర్శి రమ, ఇతర ఉద్యోగులు, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, లైబ్రేరియన్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పరువు హత్యలను నివారించాలి: రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పరువు సాకుతో చేసే హత్యల నివారణకు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో పరువు హత్యలు నివారణకై సుప్రీంకోర్టు చెప్పిన మార్గదర్శకాల మేరకు ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో సుప్రీంకోర్టు కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు చట్టబద్ధమైనవని, దేశ శ్రేయస్సు కోసం, దేశ ఐక్యత కోసం అవి చాలా అవసరమని చెప్పినట్లు గుర్తు చేశారు. కులాంతర వివాహాల విషయంలో కుటుంబం, ఆ కులం వారి సమ్మతి అవసరం లేదని స్పష్టంగా సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. కులాంతర వివాహాలు జరిగినప్పుడు ఎటువంటి వేధింపులు, హింసకు తావు లేకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సంఘం సభ్యులు సుబ్బన్న, సురేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి దుర్గాకల్యాణి

ఉరవకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శనివారం లీగల్ సర్వీసెస్ స్కీం, లీగల్ సర్వీసెస్ పథకాల గురించి మహిళలకు ఆమె వివరించారు. మహిళా చట్టాలు, ఫోక్సో చట్టం గురించి తెలిపారు. ఐకేపీ ఏపీఎం శివయ్య, లాయర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ప్యారా లీగల్ వారం టీర్ బెంజిమన్, శాంతి స్వరూప్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ గుంతకల్లు డివిజన్ సభ్యుడు ఎస్ హరిప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక దోనిముక్కల రోడ్డులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు, బడి మానేసిన ఆడపిల్లలు చదువుకోవడానికి కేజీబీవీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెహముదా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాది కారు అద్దాలు ధ్వంసం

గుత్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లో న్యాయవాది సోమశేఖర్‌కు చెందిన కారు అద్దాలను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాది తన కారును ఇంటి బయట నిలిపిఉండగా గుర్తు తెలియని దుండగులు కారు వెనక అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యం లో అనంతపురంలో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్న 25వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున పేర్కొన్నారు. శనివా రం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద జిల్లా మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొ్రటేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

గుంతకల్లు టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో శనివారం జాబ్‌మేళా పోస్టర్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు పది కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసి18 నుంచి 44 సంవత్సరాలు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకొని ఈనెల 5తేదీన ఉదయం 9.30గంటలకు ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, తలారి మస్తానప్ప, రామన్న చౌదరి పాల్గొన్నారు.

'శంకర్‌నారాయణ మృతి పార్టీకి తీరనిలోటు'


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి

బెళుగుప్ప, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోనుగుంట్ల శంకర్ నారాయణ మృతి టీడీపీకి తీరని లోటు అని కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి సంతాపం తెలిపారు. మండలంలోని ఆవులెన్న గ్రామానికి చెందిన శంకర్‌నారాయణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన సంఘటన తెలిసిందే. శనివారం ఉన్నం హనుమంతరాయచౌదరి ఘన నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నారాయణ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

'హామీల అమలును మరిచారు'

గుత్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరిచారని మాజీ ఎమ్మెల్యే వైవెంకటరామిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని వైసీపీ చేపట్టింది. ఈ మేరకు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌తో పాటు మరికొన్ని హామీలు ఇచ్చారని వాటి అతీగతి లేదని ఆయన విమర్శించారు. ఇది సరైనా పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నైరుతిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, మధుసూధన్ రెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుత్తి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపేట లో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహ స్వామికి, తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా స్వామికి వేకువజామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళ హారితినిచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి, అహోబిల నరసింహస్వామి

విద్యుత్ వైర్ల చోరీ.. ఇంటి దొంగల పనేనా..?

● గుజిరీ షాపులో పెద్దమొత్తంలో పట్టుబడిన వైనం ● పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమల వారైనా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. విద్యుత్‌వైర్లు లేవు, ట్రాన్స్‌ఫార్మర్లు లేవు, స్తంభాలు లేవు అంటూ కాలయాపన చేస్తుంటారు. కానీ ఇంత పెద్దమొత్తంలో గుజిరీ షాపుల్లో దాదాపు ఐదారుటన్నుల విద్యుత్ వైరు, పరికరాలు దొరికాయంటే ఖచ్చితంగా ఇంటిదొంగల పనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే షాపులో ఇంత పెద్దమొత్తం విద్యుత్ పరికరాలు దొరకాయంటే.. పట్టణ పరిసరాల్లో గుజిరీ షాపుల్లో తిరి గితే మరెన్ని టన్నులు చిక్కుతుందో అన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎవరో సమాచారం ఇవ్వడంతో ఒక గుజరిషాపునకే వెళ్లి పరిశీలించి సీజ్‌చేశారు. మిగతా గుజరీ షాపులకు వెళ్లిన పాపానపోలేదు. ఒకేషాపులో సుమారు రూ.10 లక్షల విలువైన సామగ్రి చిక్కినా.. దానిని తీసుకువెళ్లి పోలీస్‌స్టేషన్ కు అప్పగించి సీజ్‌చేయడం తప్ప వీరు సాధించిదేమి అంటూ పలువురు విమర్శిస్తున్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైను ఇవ్వాలని అడుగుతున్నా వైర్లు లేవు, పరికరాలు లేవు మీ పేరు లిస్టులో ఇంకా రాలేదంటూ పొంతన లేని మాటలు చెప్పడం తప్ప ఇచ్చే ఆలోచన లేదని పలువురు




గుజిరీ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు, సీజ్‌చేసిన విద్యుత్ వైరు(ఫైల్)

రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత మొత్తం విద్యుత్ సామగ్రి దొరికినా అధికారుల్లో మాత్రం చలనం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం

ఒకే గుజరీషాపులో ఇంత మొత్తం విద్యుత్‌పరికరాలు దొరకడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పటికే విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ పని ఎవరు చేసి ఉంటారు, దొంగతనం జరిగిందా సిబ్బంది ఏమైనా లాలూచీ పడ్డారా అన్న కోణంలో పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోంది.

-ప్రభాకర్‌రావు, ఏడీ, విద్యుత్ శాఖ

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యేలు, నాయకుల భరోసా ● రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం మెగా చెక్కుల అందజేత




డి.హీరేహాళ్ మండలంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధాన్యాభిషేకం, కళ్యాణదుర్గంలో మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

డి.హీరేహాళ్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంతి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు వరిధాన్యంతో అభిషేకం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కాలవ మాట్లాడుతూ.. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 42,533 మంది రైతులకు మొదటి విడతలో సుమారు రూ. 30 కోట్లు నగదును పెట్టుబడి సాయం కింద జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్ చైర్మన్ హనుమంతరెడ్డి, నాయకులు మంజునాథ్‌గౌడ్, నాగళ్లి రాజు, మోహన్‌రెడ్డి, ఏడీ పద్మావతి, ఏఓ కృష్ణకిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం : కర్షకుల కళ్లల్లో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ప్రజావేదిక వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలకు మంజూరైన అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి డబ్బులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి నీటిని అందిస్తామని భరోసానిచ్చారు. మూడు రాజధానుల పేరుతో వైసీపీ రాష్ట్ర అభివృద్ధిని నాశనం చేసిందన్నారు. కళ్యాణదు ర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 50,595 మంది రైతుల ఖాతాల్లోకి రూ.35.42 కో ట్లు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి సర్కిల్ నుంచి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ నాయకులు ఎద్దుల బండ్లలో మార్కెట్ యా ర్డుకు వచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 27,520 మంది రైతులకు రూ. 19.26 కోట్లు జమ అవుతాయన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు కొర్రలు, వడ్లు, కందులతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు కేసీ హరి, గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసు లు, మస్తానప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవి, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, రామన్న చౌదరి, గుణశేఖర్, ఆనంద్, మాతృనాయక్, మల్లికార్జున, ఫజులు, శివన్న, జడ్పీటీసీ కదిరప్ప పాల్గొన్నారు.

● తాడిపత్రి : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నియోజకవర్గ వ్యాప్తంగా 30,346మంది రైతులకు రూ21.24 కోట్లు జమచేస్తు న్నారని తెలిపారు. సబ్సిడీతో అందించే వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు ఆంజనేయులు, మునికృష్ణ పాల్గొన్నారు.

● కూడేరు : మండలంలో 9,454 మంది రైతులకు రూ, 6.62 కోట్ల మెగా చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనా రాయణశర్మ, సర్పంచు లలితమ్మ, జేడీఏ ఉమా మహేశ్వరమ్మ, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, తహసీల్దారు మహబూబ్‌బాషా, ఏఓ శుభకర్ పాల్గొన్నారు.

● ఉరవకొండ : పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, టెక్నికల్ ఏవో భరత్, నాయకులు ప్యారం కేశవానంద, తిమ్మప్ప, సుంకన్న, యేళ్లమణి, లక్ష్మీనారాయణ, ధనుంజయ ఆచారి పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంలో ఏవో మధుకర్, టీడీపీ నాయకులు సుధాకర్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

● పామిడి : పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి, సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌చౌదరి, సంజీవకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



గుంతకల్లులో చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయరాం, వెంకటశివుడు యాదవ్, తాడిపత్రిలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

వైస్ ఎంపీపీ, సర్పంచ్ వాగ్వాదం



సర్వసభ్య సమావేశంలో వాగ్వాదానికి దిగిన వైస్ ఎంపీపీ, సర్పంచ్

కూడేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశ వేదికపై ఎంపీపీ ఉండగా.. వైస్ ఎంపీపీలు ఎలా కూర్చుంటారంటూ పి. నారాయణపురం గ్రామ వైసీపీ సర్పంచ్ హనుమంతరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశ వేదికపై వైస్ ఎంపీపీలు కూర్చోకూడదని, సభ్యుల మధ్యనే కూర్చోవాలని సర్పంచ్ హనుమంతరెడ్డి అనడంతో వేదికపై ఉన్న వైస్ ఎంపీపీ సుబ్బమ్మ సర్పంచుపై మండిపడ్డారు. వేదికపై గతం నుంచి వైస్ ఎంపీపీలు కూర్చుంటున్నారని, ఆనవాయితీగా వస్తుంటే అభ్యంతరం ఎలా చెబుతారని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ప్రశ్నించారు. దీంతో సర్పంచ్ హనుమంతరెడ్డి కూడా అదేస్థాయిలో సమాధానం చెప్పడంతో కొద్దిసేపు గందరగోళంగా మారింది. విషయం అధికారులకు తెలియదా అంటూ సర్పంచు అనడంతో వైస్ ఎంపీపీలు వేదికపై కూర్చుంటారని ఎంపీపీ నారాయణరెడ్డి చెప్పారు. దీంతో మిగిలిన సభ్యులు ఇద్దరికి నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. వేదికపై వైస్ ఎంపీపీ కూర్చోవడం బాధాకరమని సర్పంచు హనుమంత రెడ్డి పేర్కొరు. అనంతరం వివిధ అంశాలపై సమావేశంలో చర్చించి ముగించారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శనివారం సమావేశం నిర్వహించి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణ కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గౌతమ్, మహమ్మద్ వలి, ఉపాధ్యక్షులుగా సాయి జశ్వంత్, అల్తాఫ్, అనిల్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, అభి, కిరణ్, అరవింద్, పట్టణ కమిటీ సభ్యులుగా నవీన్, పవన్, రాజశేఖర్, జాన్, రంజిత్, గణేష్, జయకృష్ణ, ఇర్ఫాన్, చిన్న మొత్తం 14 మంది సభ్యులతో నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి: కమిషనర్

కళ్యాణదుర్గం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఇప్పటివరకు 34 లేవుట్లు అనధికారికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. జూన్ 30, 2025 లోపు వేసుకున్న అనధికారిక లేఅవుట్ల యజమానులకు ఉపశమనం కల్పించే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా అక్టోబర్ 24లోపు రూ.10 వేలు చెల్లించి నిర్ణీత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన రుసుములో సెప్టెంబరు 10 లోపు చెల్లిస్తే 10 శాతం, అక్టోబరు 24లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ అవకాశం కల్పించిందన్నారు. క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్తులో భవన నిర్మాణాలు, నీటి వసతి, విద్యుత్ కనెక్షన్‌తో పాటు మౌలిక సదుపాయాలన్నీ ఆపేస్తామని హెచ్చరించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ రాబోయే 30 సంవత్సరాల్లో ఏ విధంగా అభివృద్ధి చెందుతుంది అన్న వాటిపై మాస్టర్ ప్లాన్ డ్రాఫ్టును కూడా మున్సిపాలిటీలో ప్రదర్శించామన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 లోపు లిఖిత పూర్వకంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కాని, అనంతపురం ఆహుడా కార్యాలయంలో కానీ తెలియజేయ వచ్చని అన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

అహుడా లేఅవుట్లలో వసతులు కల్పించాలి


అహుడా లేఅవుట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

కూడేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూడేరు, బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న అహుడా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. శనివారం కూడేరుకు వచ్చిన ఆయన అహుడా లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కూడేరులోని అహుడా లేఔట్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. లేఅవుట్‌లో శాశ్వతంగా హోర్డింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. ఆయన వెంట ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, తహసీల్దారు మహబూబ్‌బాషా, అహుడా ఈఈ దుష్యంత్ డీఈ రేవంత్, రీ సర్వే డీటీ ప్రసాద్, వీఆర్వో రమేష్ ఉన్నారు.

'బలవంతపు భూసేకరణ తగదు'


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి

గుత్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాల వ్యవసాయ భూములను బలవంతంగా సేకరించడం తగదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఎం.కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలవంతంగా వ్యవసాయ భూములను సేకరిస్తున్నారన్నారు. భూమికి బదులుగా రైతాంగానికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న గుత్తి పట్టణంలో షాదీఖానాలో సోలార్ విద్యుత్ సంస్థలు భూసేకరణ వాటి పరిణామాలపైచర్చా వేదిక నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, మల్లేష్, నిర్మల, మల్లికార్జున, రేణుకమ్మ పాల్గొన్నారు.

'ఆ భూమి దేవాలయాలకే దక్కాలి'


విలేకరులతో మాట్లాడుతున్న జనార్దనల్లి గ్రామస్థులు

విడపనకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఆక్రమించిన దేవాలయ భూమి తమ దేవాలయాలకే చెందాలని గ్రామస్థులు కోరారు. శనివారం జనార్దనపల్లిలో గ్రామస్థులు విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో కొంత మంది వైసీపీ నాయకులు జనార్దనపల్లికి చెందిన దేవాలయ భూమి 21 ఎకరాలను అక్రమంగా రిజిష్టర్ చేయించుకుని, మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆక్రమణకు గురైన భూమికి సంబంధించిన ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గత ఏడాదే దేవాలయ భూమిలోకి రాకూడదని వైసీపీ నాయకులకు పోలీసులు, గ్రామ పెద్దలు తెలిపినా పట్టించుకోలేదన్నారు. జనార్దనపల్లిలోని జనార్దనస్వామి దేవాలయం, పాండురంగ స్వామి దేవాలయానికి చెందిన ఈనాము భూమి తమ గ్రామ దేవాలయాలకే దక్కాలని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన దంపతులు

బెళుగుప్ప, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లికి చెందిన దంపతులు కష్టపడి పట్టుబట్టి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సంపాదించారు. కాలవపల్లి నరసింహులు, శారదమ్మలకు ఐదు ఎకరాల పొలం వుండగా వ్యవసాయంతో జీవనం కొనసాగిస్తున్నారు. ఇద్దరు కుమారుల్లో చిన్నవారు అక్కులప్ప ఎర్రచందనం టాస్క్‌ఫోర్సులో పనిచేస్తున్నారు. గృహిణిగా ఉన్న గౌతమి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాలని కష్టపడ్డారు. ఫలితాల్లో అక్కులప్ప 129, గౌతమి 120 మార్కులు సాధించి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు.


అక్కులప్ప, గౌతమి

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

ఉరవకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ప్రారంభించారు. కొత్తగా రెండు చోట్ల ఈ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఈవో రమేష్‌బాబు తెలిపారు. నరసింహస్వామి దేవాలయం సమీపంలో హెచ్చెల్సీ కాలువకు వస్తున్న తుంగభద్ర జలాలను ఆలయ అర్చకులు ద్వారకనాథాచార్యులు పూజలు నిర్వహించి, హారతులిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, రేగాటి నాగరాజు, మారెన్న, గోవిందు, నరేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మారుతి పాల్గొన్నారు.


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న అర్చకులు, నాయకులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి గరుడసేవ

రాయదుర్గంరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం గరుడ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో స్వామికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పలంకరణ, నైవేద్యం పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అధిష్టించి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలూరులో పోలీసుల తనిఖీలు

తాడిపత్రి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పాతబడిన ఇళ్లు, వాముదొడ్లు, ఇరువర్గాలకు చెందిన నాయకుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరికలు జారీచేశారు.


గ్రామంలో పర్యటిస్తున్న పోలీసులు